# విపశ్యన మాసపత్రిక

VOLUME:19 NO - 10 1 JANUARY, 2019

(సాధకుల ప్రేరణ కొరకు ఉద్దేశించబడిన తెలుగు మాసపత్రిక)

విపశ్యన అంతర్జాతీయ ధ్యాన కేంద్రం, ధమ్మఖెత్త, వనస్థలిపురం, హైదరాబాదు - 70

**"ధర్మవాణి"**

*నగరం యథా పచ్చన్తం, గుత్తం సన్తరబాహిరం।*
*ఏవం గోపేథ అత్తానం, ఖణో వో మా ఉపచ్చగా।*
*ఖణాతీతా హి సోచన్తి, నిరయమ్హి సమప్పితా॥*

*– ధమ్మపదపాళీ – 324, నిరయవగ్గో*

**ఎలా అయితే నలుదిక్కులా సరిహద్దులున్న ఒక నగరం లోపలా, బయటా అన్నివిధాలా రక్షింపబడుతుందో, అదే విధంగా మిమ్మల్ని మీరు ఒక్క క్షణం కూడా తప్పిపోకుండా రక్షించుకోండి, ఎందుకంటే ఒక్క క్షణం తప్పిపోయినా నరకంలో పడి శోకిస్తారు.**

## ఇదే సరైన సమయం

– భదంత వెబూ సయాడో

('సయాజీ ఊ బా ఖిన్ జర్నల్' నుండి గ్రహించబడిన ఈ ప్రవచనాన్ని భదంత వెబూ సయాడో సయాజీ ఊ బా ఖిన్, మరియు అతని శిష్యులకు బర్మీ భాషలో ఇవ్వగా, 1991లో దీనిని ఆంగ్లంలోకి భంతే ఞాణిస్సర అనువదించారు. తెలుగు అనువాదం ఆంగ్లము నుండి చేయబడినది.)

వెబూ సయాడో: సజ్జనులారా, నారీమణులారా! మీరు మీ మనసును **విముత్తి** (విముక్తి) యొక్క ఋజు మార్గంలో స్థిరపరుచుకుని **సోవచస్సతా** గుణాన్ని (బుద్ధ భగవానుని ఉపదేశాల పట్ల వినమ్ర గ్రహణశీలత – అంటే సముపార్జించాలన్న స్వభావం) ధారణ చేయటానికి నిరంతరం ప్రయత్నిస్తూ ఉండాలి. బుద్ధ భగవానుని అద్వితీయ శాసనం (శిక్షణ) పట్ల మీ గౌరవాన్ని వ్యక్తపరుస్తూ భిక్షువులను ఆదరించి, సత్కరించి వారికి దానమివ్వాలి – ఈ విధంగా పుణ్యాన్ని ఆర్జించిన తరువాత – "నేను బోధిజ్ఞానాన్ని ప్రాప్తించుకుని నిర్వాణ సాక్షాత్కారాన్ని పొందుదును గాక" అనే మంగళ వచనాలతో మీ శ్రేయస్సును కోరుకోవాలి.

ఇక్కడ నేను ***బోధి*** అన్నాను కదా, దాని అర్థమేంటంటే, నాలుగు ఆర్య సత్యాలను చక్కగా అర్థం చేసుకోవటం. ***బోధి*** మూడు రకాలుగా ఉంటుంది. అవి:

1. ***సమ్మా సంబోధి*** (సమ్యక్ సంబోధి)
2. ***పచ్చేక బోధి*** (ప్రత్యేక బోధి)
3. ***సావక బోధి*** (శ్రావక, అంటే శిష్య బోధి)

మన మంగళాన్ని, శ్రేయస్సును కోరుకోవడమంటే పై మూడింటిలో ఏదో ఒక బోధిని ప్రాప్తించుకోవాలి అనే దృఢ నిశ్చయం తీసుకోవడం. మరింత లోతుల్లోకి వెళితే ***సావక బోధి*** కూడా మూడు రకాలుగా ఉంటుంది.

1. ***అగ్గ సావక బోధి*** (అగ్ర శ్రావక బోధి)
2. ***మహా సావక బోధి*** (మహా శ్రావక బోధి)
3. ***పకతి సావక బోధి*** (ప్రకృత, అంటే సాధారణ శ్రావక బోధి)

ఇలా ఈ అద్వితీయ శాసనంలో ఎన్నో మార్గాలున్నాయి, ఎన్నో లక్ష్యాలున్నాయి. మీ అభీష్టాన్ని అనుసరించి మీరు పొందాలనుకున్న లక్ష్యాన్ని మీరు పొందగలరు.

ఎందరో మహానుభావులు ఈ మార్గాల్లో ప్రయాణించి బోధిని ప్రాప్తించుకున్నారు. మరి వారి అభీష్టాలు ఎందుకు నెరవేరాయి? ఎందుకంటే వాళ్ళు సరైన సమయంలో, సరైన స్థానంలో, సరైన ప్రయత్నం చేశారు కాబట్టి.

బుద్ధ భగవానుడు సంబోధిని ప్రాప్తించుకున్న తరువాత నుంచి ఎందరో దేవతలు, మనుష్యులు వారి వద్దకు వెళ్ళి, వారికి నమస్కరించి వారి ఉపదేశాలను అర్థం చేసుకుని వాటి ప్రకారం నడుచుకుని సమ్యక్ ప్రయత్నంతో సరైన విధంగా కృషి చేసిన వాళ్ళందరి ఆకాంక్షలూ నెరవేరాయి.

వాళ్ళు బుద్ధుని దివ్యమైన దేహాన్ని చూసో, లేదా శుద్ధ ధర్మబోధనలు విన్నంత మాత్రానో సంతృప్తి చెందలేదు. అచంచలమైన శ్రద్ధ కలిగి, ధర్మాన్ని స్పష్టంగా అర్థం చేసుకున్న తర్వాతే వాళ్ళు ధర్మమార్గంలోకి ప్రవేశించి, ధర్మంలో శరణు తీసుకున్నారు. కరుణానిధియైన

బుద్ధుడు, తాను స్వయంగా దర్శించుకున్న సత్యాన్ని వర్ణించి చెప్పాడు, దాన్ని తెలుసుకునే మార్గాన్ని వివరించాడు. ప్రజలకు బుద్ధుని ఉపదేశాలు అర్ధమవగానే, వాటిని పాటిస్తూ శరీరపు నాలుగు స్థితులలోనూ (పడుకోవటం, కూర్చోవటం, నిలబడటం మరియు నడవటం) అలసట లేకుండా, కఠిన ప్రయత్నంతో ధర్మసాధన చేశారు. ఈ విధంగా తనలోని మనోవికారాలను దూరం చేసుకునే విధంగా, సద్గుణాలను సమృద్ధి చేసుకునే విధంగా, నిరంతరంగా అలసట లేకుండా, వ్యాకుల పడకుండా సాధన చేయటమే **సమ్యక్ వ్యాయామం** (సమ్యక్ ప్రయత్నం) అనబడుతుంది.

ధర్మం పట్ల నిష్ఠ కలిగిన వ్యక్తి పురుషార్థం చేసి తన **సమ్యక్ మనోరథాన్ని (సమ్మా ఛంద** ను) సాధించుకుంటే, తాను పొందిన సంపూర్ణ ఆనందంతో ప్రసన్నుడౌతాడు. అన్ని రకాల దుర్గుణాల నుండి ముక్తి పొందిన ఈ నిజమైన ఆనందం, జన్మ-జన్మాంతరాల దుఃఖాలన్నింటినీ అధిగమించినది. ఇదే ముక్తిలోని ఆనందం. దీనిని ప్రాప్తించుకున్న వ్యక్తి ఈర్ష్య, అసూయలు కలిగి ఉండడు. కాబట్టే తాను పొందిన ఆ ముక్తి సుఖాన్ని ఎల్లప్పుడూ ఇతరులతో పంచుకుంటాడు. అలా పుణ్యాన్ని వితరణ చేయటం అతని కర్తవ్యం. కాబట్టి, అలాంటి వ్యక్తి ప్రసన్నుడవటం వల్ల ఇంకా మంచి జరిగింది.

కాబట్టే మంచివారిని సంతోషపెట్టటానికి మరియు అన్ని ప్రాణుల ఆనందం కొరకు మీరందరూ బుద్ధవాణిని హృదయంగమం చేసుకోవాలి, దానిని అందరికీ వితరణ చేయాలి. ఉపాసకులైన మీరు భిక్షువులకు అవసరమైన వస్తువులు దానంగా ఇవ్వటం ద్వారా "ధర్మానికి" సహాయం చేస్తారు, బదులుగా భిక్షువులు "ధర్మాన్ని" ఇవ్వటం ద్వారా ప్రజలకు సహాయం చేస్తారు. ఎంతగా మంచి జరుగుతుంది! అందరికీ ఆనందదాయకమైనదీ!!

ఎవరైతే సమ్యక్ ప్రయత్నంతో, నిష్ఠతో సాధన చేస్తారో, ఎవరిలోనయితే శ్రద్ధాబలం శుద్ధరూపంలో ఉందో, ఎవరికయితే అవసరమైన వస్తువులను ఉదారతతో దానమివ్వబడుతుందో, ఎవరిలోనయితే **సోవచస్సతాగుణం** ("ధర్మం" పట్ల వినమ్ర గ్రహణశీలత) ఉంటుందో, వారికి తప్పక లాభం చేకూరుతుంది. ఇదే బుద్ధుని శిక్షణలోని గొప్ప ప్రయోజనం.

ఈ విధంగా భగవానుని సమయం నుండి నేటి వరకూ సదాశయం, శ్రద్ధాబలం కలిగి ఉన్న సత్పురుషులు పురుషార్థం చేసి, బుద్ధశాసనాన్ని ముందుకు నడిపించే పనిలో నిమగ్నమయ్యారు. ఇలా "ధర్మాన్ని" సంతోషంగా ఒక తరం నుండి మరొక తరం వరకూ అందిస్తూ ఉండటం ఎంతో శ్లాఘనీయం. బోధనలు అందుబాటులో ఉన్న ఈ సమయంలోనే, అనుకూలమైన పరిస్థితులున్నంత వరకే, పరిశ్రమించదలచిన సత్పురుషులకు ఇదే శ్రేష్టమైన అవకాశం.

ధర్మోపదేశం చేస్తూ, ధర్మచారిక చేస్తున్న ప్రారంభిక దశలోనే, బుద్ధుడి సన్నిధిలోకి వచ్చిన మగధ దేశపు రాజు బింబిసారుడికి జ్ఞానోదయమయి, ముక్తి యొక్క నిజమైన సుఖశాంతులు అనుభవంలోకి వచ్చాయి. వివేకవంతుడైనందున, అతడు తత్పరతతో వేణువనాన్ని భిక్షుసంఘానికి వసతి కోసం దానమిచ్చాడు. అక్కడ భగవానుడు దేవతలు, మానవులెందరికో అనేక ప్రవచనాలిచ్చారు. ఆ బోధనల ప్రభావంతో ఆనాటి నుండి నేటి వరకూ లెక్కలేనన్ని ప్రాణులు అసలైన సుఖశాంతులను ప్రాప్తించుకుంటూ వస్తున్నారు.

-- భగవానుని బోధనలు ఏంటి?

సయాజీ: మూడు పేటికల్లోని ఉపదేశాలు భంతే! (భంతే అనేది గౌరవాన్ని సూచించే పదం).

-- ఆ మూడేంటి?

సయాజీ: **'సుత్తపిటక'** (ప్రవచనాలు), **'వినయపిటక'** (భిక్షువులు పాటించాల్సిన నియమాలు) మరియు **'అభిధమ్మపిటక'** (ధర్మానికి చెందిన లోతైన సూక్ష్మతలు) భంతే!

-- అవునవును, ఇవన్నీ చదవటానికే! కానీ వీటిలోని సారమంతా **'శీలము'** (శీల - సదాచారాలు), **'సమాధి'** (ఏకాగ్రత) మరియు **'ప్రజ్ఞ'** (వివేకం)లో వచ్చేసింది.

-- దేనికీ మూడూ?

సయాజీ: నిజజీవితంలో వీటిని ఆచరించి, గ్రహించి, అభ్యాసం చేయటానికే భంతే!

-- ఒక వ్యక్తి వీటిని అనుసరించి నడుచుకుంటే అతడు ఏమి పొందగలడు?

సయాజీ: ఆ వ్యక్తి నిజమైన సుఖశాంతులను మరియు దుక్ఖవిముక్తినీ పొందగలడు, భంతే!

-- అ ప్రతిఫలం అతనికి ఈ జన్మలోనే వస్తుందా, లేదా మరోజన్మలో వస్తుందా?

సయాజీ: ఇక్కడే, ఈ క్షణంలోనే వస్తుంది, భంతే! దానికి ఏమాత్రం ఆలస్యం కాదు.

-- అవును, దీనినే **సందిట్ఠిక** - ధర్మం స్వయంగా, మీకు మీరుగా తెలుసుకోదగినది, **అకాలిక** - అంటే ఏమాత్రం ఆలస్యం లేకుండా, ఈ క్షణంలోనే, ఇక్కడే సత్ఫలితాలు వస్తాయి.

-- ఎంతటి అపూర్వమైన విషయం కదా! ఎంత అద్భుతమైన విషయం!!

తిపిటకాలలో ఎన్ని రకాల ధర్మాలున్నాయి?

సయాజీ: మూడు రకాల ధర్మాలున్నాయి భంతే! **సుత్త, వినయ** మరియు **అభిధమ్మ.**

-- మరి **'పటిపత్తి'** లో (సాధన) ఎన్ని రకాలు ఉన్నాయి?

సయాజీ: శీలము, సమాధి మరియు ప్రజ్ఞ, భంతే!

-- మరి **పటివేధన** (ప్రతివేధన – మనసు లోతుల్లో దాగి ఉన్న క్లేశాలను బేధించి, విడగొట్టి చూడటం)లో ఎన్ని రకాలున్నాయి?

సయాజీ: **ప్రతివేధనలో** మూడు రకాలున్నాయి, భంతే! ***'మగ్గ'*** (మార్గం), ***'ఫల'*** (ఫలం) మరియు ***'నిబ్బాన'*** (నిర్వాణం).

-- అలా ధర్మాలు ఎన్నో రకాలుగా ఉన్నప్పటికీ, బంధనాల నుండి బయటపడేసే లక్షణంలో మాత్రం ఒక్కటే ధర్మం – అదే "విముక్తి ***(విముత్తి)*** ధర్మం. అదే విధంగా సాధనలో కూడా ఒకే ఒక్క అనుపమ మార్గముంది. అదే ***'సతి'*** (స్మృతి – జాగరూకత). కాబట్టే ఈ శ్రేష్ఠమైన మార్గాన్ని అనుసరించిన దేవతలు, మనుష్యులు ఈ అద్వితీయమైన, సాటిలేని ధర్మాన్ని – అంటే ***'విముత్తి'*** ని పొందారు. ఇదే నిర్వాణం.

ఇదే బుద్ధుడు బోధించిన ***'ఏకో ధమ్మో'*** (ఏకైక ధర్మం). విశ్లేషిస్తూ వివరాల్లోకి వెళ్తే లెక్కలేనన్ని ధర్మాలుంటాయి. వీటిలో ఈ ఒక్కదాన్ని నేర్చుకున్నా, పాటించటానికి సరిపోతుంది.

దుఃఖచక్రం నుండి ముక్తి పొందగోరిన వ్యక్తులు – గ్రహణశీలత మరియు సౌమ్యత ***(సోవచస్సతా గుణం),*** వీర్యంతో కూడుకున్న సంకల్పబలం ***(ఆరద్ధ వీరియ)*** మరియు కుశాగ్ర వివేకం ***(పటివిద్ధ పఞ్ఞా)*** అనే మూడు గుణాలను కలిగి ఉండటం తప్పనిసరి. ఏ వ్యక్తిలోనయితే ఈ గుణాలన్నీ ఉంటాయో, ఆ వ్యక్తి జనన – మరణాల చక్రం నుండి తప్పక ముక్తి పొందుతాడు.

అందుకే, అద్వితీయమైన ఈ శాసనం ఉన్నంతలోనే బుద్ధుడు చెప్పిన ఉపదేశాలను బాగా అర్థం చేసుకోవాలి. మీరు ధర్మాన్ని చక్కగా అర్థం చేసుకున్నాక, మీ ధ్యాసను శరీరంపట్ల స్థిరంగా నిలిపి ఉంచాలి. మనసును సాధుస్వభావంగా మరల్చుకునే శిక్షణనివ్వటానికి దానిని శరీరంపై కేంద్రీకరించి స్థిరంగా నిలిపి ఉంచాలి.

-- మనసును శరీరం పట్ల కేంద్రీకృతం చేయటమంటే ఏంటి?

సయాజీ: మనసును శరీరం పట్ల కేంద్రీకృతం చేయటమంటే ***'సతి'*** (స్మృతి)

--మనసును స్థిరంగా, నిలకడగా ఉంచటం అంటే ఏంటి?

సయాజీ: దాన్ని ***'సమాధి'*** (ఏకాగ్రత) అంటారు.

-- మనసుకు శిక్షణనివ్వటం అంటే ఏంటి?

సయాజీ: మనసుకు శిక్షణనివ్వటాన్ని ***'వీర్య'*** (ప్రయత్నం, పరాక్రమం) అంటారు.

-- మనసును సాధుస్వభావంగా మరల్చుకోవటం అంటే ఏంటి?

సయాజీ: మనసును సాధుస్వభావంగా మరల్చుకోవటాన్ని ***'ప్రజ్ఞ'*** (వివేకం) అంటారు, భంతే!

-- వాహ్ శ్రీమాన్.... సాధు, సాధు, సాధు – చక్కగా చెప్పారు! సరిగ్గా చెప్పారు!! ఎంత ఉత్తమమైన విషయం కదా! ఎంత అద్భుతమైన విషయం కదా!!

సయాజీ: ***ఏవం భంతే,*** (అవును భంతే!) సర్వశ్రేష్ఠమైన ఈ **శాసన** (బోధన) నిజంగా ఎంత అపూర్వం!

-- వినటం, చదవటం ద్వారా ఎంతో జ్ఞానం సంపాదించవచ్చు. ఎంతగానో నేర్చుకోవచ్చు. కానీ అది హృదయంగమం కావటం తప్పనిసరి. అలా కావాలంటే మీకున్న శృతమయ జ్ఞానం ***(సుతమయ పఞ్ఞా),*** స్వానుభూతి ఆధారంగా జ్ఞానం సంపాదించుకునేందుకు ప్రేరణ కలిగించాలి. అలా వృద్ధిపరుచుకున్న **భావనామయ పఞ్ఞా,** క్లేశాల సంగ్రహాన్ని చీల్చుకుంటూ పోయేదిగా పరిణతి చెందుతుంది. కేవలం ఈ సూక్ష్మ – భేద జ్ఞానమే మిమ్మల్ని ముక్తి పరచగలుతుంది. అవునా?

సయాజీ: అవును, భంతే!

-- నిజంగా చేయవలసిన సుకర్మము ఇదొక్కటే. ఈ సూక్ష్మ – భేద గుణము ఎవరి మనస్సులో స్థిరపడుతుందో, ఆ వ్యక్తిలో లోభం, కోపం, మోహం, దుఃఖం, దౌర్మనస్యం వంటి గుణాలు ఉండలేవు. దానితో ఆ వ్యక్తి నిజమైన సుఖశాంతుల ఆనందాన్ని పొందుతాడు. ఎంతో మేలు జరిగినట్లే కదా?

సయాజీ: అవును, పూజ్య భంతే!

-- కాబట్టి రాగం లేకపోవటాన్నే సుఖమంటారు. ద్వేషం లేకపోవటాన్నే సుఖమంటారు. మోహం లేకపోవటాన్నే జ్ఞానం అంటారు. ఈ లాభాలన్నీ ఈ జన్మలోనే లభిస్తాయి. కాబట్టి ఈ లాభాలు పెంచుకోవటానికి ఆలస్యం చేయవద్దు. ***'అసోకము'*** (శోకం లేకపోవడం), ***'విరాగము'*** (తృష్ణ లేకపోవడం); ఇవే నిజమైన సుఖశాంతులు, ఇదే దుఃఖనిరోధము.

ఈ క్లేశాల నుండి ముక్తి పొందాలనే మన ప్రబలమైన ఆకాంక్షనే అవసరమైన శక్తి ***(రిద్ధి)*** పొందే మార్గం అవుతుంది. ***ఛంద ఇద్ధిపాద*** అవుతుంది. ఈ దృఢమైన ఆకాంక్ష ఆధారంగా చేసే ప్రయత్నంలో ఎంతో బలముంటుంది. ఇదే ***'విరియ ఇద్ధిపాద'*** అవుతుంది. దీనితో మనసు దృఢంగా, నిలకడగా, సరళమయి ఏకాగ్రత చెందుతుంది. అలాంటి చిత్తమే శక్తికి ***(రిద్ధికి)*** మార్గమౌతుంది. అంటే ***'చిత్త ఇద్ధిపాద'*** అవుతుంది.. ఇచ్ఛ, ప్రయత్నం మరియు చిత్తం – ఈ మూడూ దృఢంగా, స్థిరంగా, వీర్య సంపన్నంగా అయినప్పుడు విచారణ శక్తి, విచక్షణ, మరియు సంపూర్ణ జ్ఞానం ప్రాప్తిస్తాయి. ఈ జ్ఞానం ఇద్ధికి మార్గమౌతుంది. అంటే **విమంస ఇద్ధిపాద** అవుతుంది.

కాబట్టే బుద్ధ భగవానుడు, ఇలా ప్రతిపాదించాడు: ***'కేవలం పరిపుణ్ణం సత్థుసాసనం'*** – అంటే సమస్త శాసనం దానికదే పరిపూర్ణమైనది అని. మరి ఈ విధంగా అది పరిపూర్ణమైనదా?

సయాజీ: నిజంగానే ఇది అన్ని కరణీయ కార్యాలతో పరిపూర్ణమైనది, భంతే!

-- ఈ కరణీయాలన్నింటినీ పూర్తి చేసిన వ్యక్తి ఇప్పుడే, ఇక్కడే సుఖాన్ని పొందుతాడు. ఎలాంటి ఆలస్యమూ ఉండదు. మనల్ని చిక్కుల్లో పెట్టి మనకు దుఃఖాన్నిచ్చే క్లేశాలు ఒక్కటి కూడా మిగలకుండా అన్నీ

నశించిపోవటం వల్ల వచ్చే అనుపమ సుఖం ఇదే. ఈ సుఖం సాధకునిలో దృఢంగా నిలిచిపోయేది. ఎప్పటికీ సడలిపోదు, మార్పు చెందదు. మీరు ఈ అలౌకికమైన సుఖాన్ని ఆదర్శంగా, ఉత్తమంగా భావించాలి.

ఇంద్రియ భోగాలలో దొరికే లౌకిక సుఖంలో ఎన్నెన్నో చిక్కుముడులు, ఎంతో కలవరం, ఎన్నెన్నో అవరోధాలు, శతృత్వాలు, శోకసంతాపాల వంటివి ఉన్నాయి. అవునా?

సయాజీ: అవును, భంతే!

-- మనుష్య-సుఖం, రాజ-భోగం, దేవ-సుఖం మరియు ఇంద్ర-బోగాలను ఉదాహరణంగా తీసుకుందాం. ఈ సుఖభోగాలన్నీ పేరుకే! ఇవన్నీ నామమాత్రానికే!! ఇవన్నీ ఒట్టి డొల్లలే, వీటిలో ఏమాత్రం సారం లేదు. ఒక ప్రాణి వీటిని భోగిస్తాడంటే, అది దేని ద్వారా జరుగుతుంది.

సయాజీ: వేదనల ద్వారా అనుభవిస్తాడు, భంతే!

-- అవును, అందుకే వీటిని ***వేదయిత సుఖమ***ని అంటారు. ఇంద్రియ సుఖం ఎప్పటికీ మార్పు చెందుతూ ఉండేదే. శాశ్వతం కాదు. విపరిణామమే! అనిత్యమే! మానవులు, దేవతలు ఈ లౌకికభోగాల – వేదనలను అనుభవిస్తున్నప్పుడు లోలోనే మనోవికారాలు దాగి ఉంటాయా లేదా?

సయాజీ: భంతే, వాళ్ళు ఇంద్రియ సుఖాల నుండి ఆనందాన్ని పొందితే ఆ అనుభూతిలో లోభము, తృష్ణ, కామవాంఛ తప్పక దాగి ఉంటాయి.

-- ఈ ఇంద్రియ – సుఖాన్ని భోగించే వాళ్ళు ఐదు శతృవుల నుండి (అగ్ని, నీరు, దుష్టుడైన రాజు, చోరుడు, మూర్ఖుడు) భయపడితే, లేదా పాత పుణ్యకార్యాల సంపద అంతమైపోయిన కారణంగా వాళ్లకి ఈ సుఖం వీడిపోతే, లేదా జీవితకాలం పూర్తయిన కారణంగా మృత్యువుకి దగ్గరగా చేరుకుని ఉంటే – ఇలాంటి సందర్భాల్లో వాళ్ళు ఇంద్రియ భోగాల సుఖాన్ని ఎలా పొందగలరు?

సయాజీ: అలాంటి సందర్భాల్లో ఇంద్రియ సుఖాల ఆనందాన్ని పొందలేరు. వాళ్ళు తప్పకుండా శోక, పరిదేవ, దుఃఖ, దౌర్మనస్యాలను అనుభవిస్తారు.

-- ఆ సమయంలో వాటి దుఃఖ-వేదనల్లో ఎటువంటి మనోవికారాలు ఇమిడి ఉంటాయి?

సయాజీ: భంతే, వాళ్ళ దుఃఖ-వేదనలలో కోపం, ద్వేషాలే ప్రముఖంగా ఉంటాయి.

-- కాబట్టి సుఖ వేదనల సుఖం క్షణికమైనదే, ఎంతో తక్కువ సమయం పాటు ఉంటుంది. ఇది ఎల్లప్పుడూ మార్పు చెందుతూనే ఉంటుంది. దీనిలో ధృవమైన సారమేమీ లేదు. కానీ శాంతి-సుఖం ***(సంతి-సుఖ)*** మాత్రం ఎప్పటికీ మార్పు చెందనిది. దానిలో మార్పు జరగదు. ఇది శాశ్వతమైనది. మరి అది అలా ఎందుకు ఉంటుంది? ఎందుకంటే శాంతి-సుఖంలో ఎటువంటి మనోవికారాలూ ఉండవు. అన్ని రకాల దుఃఖాలకు మూలాలైన వికారాలను అది నిర్మూలిస్తుంది. శేషం లేకుండా చేస్తుంది. ఇదే దుఃఖ నిరోధం. ధర్మంతో చేకూరే లాభమిదే.

కాబట్టే ఓ ఉపాసక, ఉపాసికల్లారా (గృహస్థ శిష్యగణం), అసమాన ఆచార్యుని ఈ అద్వితీయ శాసనం నుండి లాభం పొందే ఉత్తమ అవకాశం అందుబాటులో ఉన్న సమయంలోనే సదాశయ బలంతో, సమ్యక్ ప్రయత్నంతో, స్థిరచిత్తంతో, మార్గాన్ని స్పష్టం చేసే జ్ఞానంతో సుఖశాంతులను ప్రాప్తించుకోటానికి గట్టిగా పరిశ్రమించండి. ఇప్పుడే, వెనువెంటనే, ఏమాత్రం ఆలస్యం చేయకుండా దీక్షతో సాధన చేయండి. అందరికీ శాంతి లభించుగాక!

శ్రోతలు: సాధు, సాధు, సాధు

రెండు సంవత్సరాలకు చందా రూ 100/- **విపశ్యన తెలుగు మాసపత్రిక** జీవిత చందా రూ. 500/-
ప్రచురణ తేది: ప్రతినెల 30/31 పోస్టింగ్ తేది: ప్రతి నెల 1/2 వెల: రూ 5/-
**విపశ్యన అంతర్జాతీయ ధ్యానకేంద్రం, నాగార్జున సాగర్ రోడ్, వనస్థలిపురం, హైదరాబాదు – 500 070.**
**ఫోన్: 24240290 (ధ్యానకేంద్రం) ఆఫీసు పనిచేయు వేళలు: ఉదయం 9గం॥ల నుండి సాయంత్రం 5 గం॥ల వరకు**

Postal Reg. HSE/864/2019-2021 RNI Reg. No. APTEL/2006/17745

**PRINTED MATTER**

If Undelivered please return to :
**VIPASSANA INTERNATIONAL MEDITATION CENTRE,**
12/6KM, Nagarjuna Sagar Road, Sahebnagar, Vanasthalipuram,
HYDERABAD - 500 070.
Website : www.vri.dhamma.org
E-mail : info@khetta.dhamma.org

Published for Vipassana International Meditation Centre, 12/6KM, Nagarjuna Sagar Road, Sahebnagar, Vanasthalipuram, Hyd.(A.P)-70 Ph: 040-24240290, Published by Smt. Sabrina Katakam.
Editor : Sri G.V.Subrahmanyam., Printed at Sai Likhita Printers, #6-2-959, Dakshin Bharat Hindi Prachar Sabha Complex, Khairatabad, Hyd. Ph : 2332579.